క్లుప్తంగా

నియామకాలు

బీఆర్ఎస్ 14 డివిజన్లకు సమన్వయకర్తగా 'పంతంగి'..



వెంకటేశ్వర్లు

ఖమ్మంఅర్బన్: బీఆర్ఎస్ పార్టీకి నగరంలోని 2వ డివిజన్ నుంచి 15వ డివిజన్ల వరకు మొత్తం 14 డివిజన్లకు సమన్వయకర్తగా 5వ డివిజన్ బాలాజీనగర్‌కు చెందిన పంతంగి వెంకటేశ్వర్లును నియమితులయ్యారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు వెంకటేశ్వర్లు తెలిపారు.

బీఆర్ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా కిరణ్..



పల్లా కిరణ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా పల్లా కిరణ్‌ను నియమించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో మంత్రి అజయ్‌కుమార్ పల్లా కిరణ్ నియామకాన్ని ప్రకటించారు.

జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌టీపీ సమావేశం మండలంలోని సత్యనారాయణపురంలో గల టీసీవీరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించబడుతుందని వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి తెలిపారు. నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు. నాయకులు తోట చినవెంకటరెడ్డి, బత్తిని యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ సభ్యుల సంక్షేమమే లక్ష్యం

నేలకొండపల్లి: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుల సంక్షేమమే సొసైటీ లక్ష్యమని చెరువుమాధారం మత్స్య సొసైటీ ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి అన్నారు. సొసైటీ పరిధిలోని రాయగూడెం, చెరువుమాధారం గ్రామాలకు చెందిన ఇరువురు సభ్యులు ఇటీవల మృతి చెందగా.. వారికి సొసైటీ అధ్యక్షుడు ఖాసీం సూచనల మేరకు ఇరువురి కుటుంబాలకు రూ.10 వేల చొప్పున శనివారం ఆర్థిక సాయం అందించి మాట్లాడారు. ఈ సమావేశంలో కార్యదర్శి పృథ్వీరాజ్, డైరెక్టర్లు శేషయ్య, తేజావత్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఖమ్మంరూరల్: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆర్‌ఓ రాజేశ్వరి తెలిపారు. శనివారం రాత్రి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనేపథ్యాన సువిధ, సీ–విజిల్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గురించి నాయకులకు వివరించారు. తహసీల్దార్ బీవీ.రామకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న వ్యాపారులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కస్బాబజార్‌లో గల జై శ్రీరామ్ ఫ్రూట్ మర్చంట్స్ కేంద్రంలో వాల్మీకి అభిమానులు, బోయ కులస్తులు, పలువురు వ్యాపారుల ఆధ్వర్యాన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతినిధులు అన్నపు మల్లిఖార్జున్, దగ్గు శ్రీను, రామారావు, లక్ష్మయ్య, ఉపేందర్, శ్రీను, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసేందుకు యత్నం

ఖమ్మంఅర్బన్: కుటుంబ కలహాలతో ఆగ్రహించిన ఓ వ్యక్తి తన భార్యపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టేందుకు యత్నించాడు. ఖమ్మం యూపీహెచ్ కాలనీలో నివసించే నవ్య బ్యాంకులో విధులు నిర్వర్తిస్తోంది. ఆమెకు భర్త మధుతో గొడవ జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఖానాపురం విద్యుత్ కార్యాలయం వద్ద ఆమెపై శనివారం మధు పెట్రోల్ పోసి నిప్పు పెట్టే ప్రయత్నం చేశాడు. దీంతో గమనించిన స్థానికులు ఆయనకు దేహశుద్ధి చేసి ఖమ్మం అర్బన్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

రఘునాథపాలెం: పురుగుల మందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. రఘునాథపాలెం మండలం శివాయిగూడెంకు చెందిన బానోతు నాగమణి(26)కి వివాహం జరగగా విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఆమెతో గ్రామానికే చెందిన రాంబాబు ఐదేళ్లుగా సాన్నిహిత్యం పెంచుకోగా, తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో నాగమణి శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపాన పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కాగా, ఆమెకు రాంబాబే పురుగుల మందు తాగించాడని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండలరావు తెలిపారు.

ఒంటిపూట దవాఖానాలు..

ఫేస్ యాప్ ద్వారా విధులకు హాజరై.. తర్వాత డుమ్మా కొడుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు

- మధ్యాహ్నం దాటితే కుర్చీలన్నీ ఖాళీ
- ఓపీలు తప్పుగా వేస్తూ తప్పుదోవ పట్టిస్తున్న వైద్య సిబ్బంది
- పట్టించుకోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు



జల్లెపల్లిలో ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ



దమ్మాయిగూడెం పల్లె దవాఖానాలో మధ్యాహ్న సమయంలో ఖాళీగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ కుర్చీ (ఇన్‌సెట్) దమ్మాయిగూడెం పల్లె దవాఖానాలో ఖాళీగా ఉన్న సూచిక బోర్డు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలు ఒక్కపూటకే పరిమితమవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సిన ఎంఎల్‌హెచ్‌పీలు ఉదయం ఫేస్ యాప్ ద్వారా హాజరు వేసుకుని మధ్యాహ్నం కాగానే విధులకు డుమ్మా కొడుతున్నారు. పల్లెదవాఖానాలను పర్యవేక్షించాల్సిన వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తిరుమలాయపాలెం: మండలంలో జల్లెపల్లి, పాతర్లపాడు, దమ్మాయిగూడెంలలో పల్లె దవాఖానాలు ఉన్నాయి. వీటిలో పనిచేసే వైద్య సిబ్బంది ఫేస్ యాప్ ద్వారా ఉదయం హాజరు వేయించుకుని మధ్యాహ్నం కాగానే ఇష్టారీతిన విధులకు డుమ్మా కొడుతుండడంతో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయాన ఆస్పత్రులలోని కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

తప్పుడు రికార్డులతో తప్పుదోవ..

గ్రామీణ ప్రాంతాల్లో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా.. అవేమి చేయకుండా తప్పుడు రికార్డులు సృష్టించి పై అధికారులకు పంపుతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆస్పత్రుల్లోనూ ఓపీ సంఖ్యను కూడా తప్పుగా వేస్తూ జిల్లా అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతి నెలా షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు సరఫరా చేయాల్సి ఉండగా అవేమి చేయడం లేదు. ఆయా దవాఖానాలలో పనిచేసే ఏఎన్‌ఎంలు కూడా సమయపాలన పాటించకపోవడంతో బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందక వేచి చూసి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాక ఆస్పత్రుల్లో సూచిక బోర్డులు కూడా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉదయం మాదిరిగానే సాయంత్రం సమయంలో కూడా ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ప్రతీ దవాఖానాలో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలి. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం. సమయపాలన తప్పక పాటించాల్సిందే.

– రామారావు, తిరుమలాయపాలెం పీహెచ్‌సీ వైద్యుడు

ప్రజలకు మంచి చేయాలనే నా తపన..

బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్



పువ్వాడను సన్మానిస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు అనిల్‌కుమార్

ఖమ్మంఅర్బన్ / ఖమ్మం మయూరిసెంటర్: ప్రజలకు మంచి చేయాలనేదే నా తపన అని.. ఇందుకోసం వ్యక్తిగత జీవితం సైతం కోల్పోయానని, కుటుంబంతో సరిగా గడపలేకపోగా, వ్యాపారాన్ని కోల్పోయినా ప్రజల కోసమేనని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలో యువజన విభాగం నాయకుడు గాదె అనిల్‌కుమార్ ఆధ్వర్యాన జరిగిన ఆత్మీయ సమ్మేళనంతో పాటు 5వ డివిజన్ బాలాజీనగర్ రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో సర్పంచ్ మెంటెం రామారావు ఆధ్వర్యాన, 22వ డివిజన్‌లో పల్లా కిరణ్ ఆధ్వర్యాన శనివారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి 2014లో తన చేతిలో, 2018లో కందాల ఉపేందర్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన ఆయన మళ్లీ ఈసారి ఓడిపోవడం ఖాయమన్నారు. ఖమ్మంలోని ప్రతీ డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయగా, రఘునాథపాలెం మండలంలోనూ ఆ స్థాయి అభివృద్ధి జరిగిందని తెలిపారు. కుండలో ఉన్న నీళ్లు తాగాలా ఆకాశం వైపు చూద్దామా అనేది నిర్ణయించుకోవాలని సూచించారు. కరోనా, మున్నేటి వరదల సమయంలో తాను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అండగా నిలిస్తే ప్రత్యర్థి మాత్రం ఎక్కడ నిద్రపోయారో చెప్పాలన్నారు. ఆయన పూర్తిగా అబద్ధాల కోరు అని, ఆయనను నమ్మితే నట్టేట ముంచడం ఖాయమని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు కోసమే బీఆర్ఎస్‌లోకి వచ్చానని చెప్పే తుమ్మల, నువ్వు గతంలో మంత్రి ఉన్నప్పుడు ఎందుకు చేయలేదో చెప్పాలని సూచించారు. ఎవరేం మాట్లాడినా, ఎన్ని కుట్రలు పన్నినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆరేనని పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కాగా, ఖమ్మం 22వ డివిజన్‌లో జరిగిన సమ్మేళనంలో 100 మంది యువత బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి పువ్వాడ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే, చింతగుర్తిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు చేసిన పువ్వాడ, 44వ డివిజన్‌లో మైనారిటీ నాయకుడు షేక్ మహమూద్‌ను పరామర్శించారు. ఈసమావేశాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, మార్కెట్ చైర్మన్లు కురాకుల నాగభూషణం, దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్లు పల్లా రోజ్ లీనా, దండా జ్యోతిరెడ్డి, నాగండ్ల కోటితోపాటు ఖమర్, సుధాకర్, దారా ప్రవీణ్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, గుత్తా రవి, యర్రంశెట్టి రవి, గొర్రె శ్రీను, సత్యవర్ధన్ రెడ్డి, విజయ్‌రెడ్డి, వలీ, జానీ, కాంపాటి రవి, కె.వెంకటేశ్వర్లు, వీరూనాయక్, మందడపు నర్సింహారావు, కుర్రా భాస్కర్‌రావు, తాతా వెంకటేశ్వర్లు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, రాంబాబు, సంగయ్య, కేతినేని సీతరామయ్య, తొట్టి ఉమారాణి, వలి, కొలేటి రాధాకృష్ణ, వంటికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, కొమరయ్య, బొల్లి రాములు, సురగాని బాబు పాల్గొన్నారు.

'హార్వెస్ట్'లో ఆత్మీయ సమ్మేళనం



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలలో శనివారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. నగరంలో ప్రజలకు కావాల్సిన అన్ని వసతులు అందజేశామని, మరో ఐదేళ్లు నాకు అవకాశం ఇస్తే హైదరాబాద్కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొగ్గారపు రామచందర్, గొల్లపుడి రాంప్రసాద్, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, బిక్కసాని ప్రశాంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి వల్లే ఖమ్మాన్ని మున్నేరు ముంచింది..

ఆత్మీయ సమ్మేళనాల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంవన్‌టౌన్: సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంఅర్బన్: అవినీతితో కట్టిన చెక్‌డ్యాం వల్లే ఖమ్మం నగరాన్ని మున్నేరు వరదలు ముంచెత్తాయని, ఖమ్మంలో ఏ శిలాఫలకం చూసినా తాను చేసిన అభివృద్ధి ఏంటో తెలుస్తుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలో నిర్వహించిన పలు ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం ఒకచోట కట్టాల్సిన చెక్‌డ్యాంను మరోచోట ఎత్తుగా కట్టారని, వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్నేరు గండాన్ని లేకుండా చేస్తానన్నారు. నా హయాంలోనే ఖమ్మాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి నాకు అవకాశం ఇచ్చి ఖమ్మం అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. తెలంగాణ కల సాకారం చేసిన సోనియమ్మ రుణం తీర్చుకునేలా కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక...

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో పలువురి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ నాయకులు వలపిన్ని మాధవయ్య, రాచర్ల ఉపేందర్, భాగం కోటేశ్వరరావు,రావూరి నాగయ్య, నగరంలోని 4,5 డివిజన్ల పరిధిలోని యూపీహెచ్ కాలనీకి చెందిన వివిధ పార్టీలకు చెందిన వారు కార్పొరేటర్ పల్లెబోయిన భారతి, చంద్రం, నాయకులు ఏలూరు శ్రీనివాస్‌రావు, హనుమంతరావు, రమేష్‌లతో పాటు మరో 100 మంది ఉన్నారు. అలాగే విజయలక్ష్మి ఆస్పత్రి డాక్టర్ వెలిగేటి విజయలక్ష్మి, చంద్రమోహన్, 44 డివిజన్‌లో ప్రముఖ వైద్యుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావులను కలిసి మద్దతు కోరారు. ఈకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, దొబ్బల సౌజన్య, బాలగంగాధర తిలక్, ఖాదర్‌బాబా, నాయకులు దండా ప్రసాద్, గోరంట్ల రమేష్ బాబు, జంగం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువైనది



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం సహకారనగర్/ ఖమ్మంలీగల్: ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనదని, ఓటు అనే రెండు అక్షరాలు దేశ భవిష్యత్తునే మార్చేస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం కలెక్టరేట్, జిల్లా కోర్టులో ఓటు హక్కు, సీవిజిల్ యాప్‌పై ఉద్యోగులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొబైల్‌లో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, సీ–విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచవచ్చన్నారు. ఈ కార్యక్రమాల్లో స్వీప్ నోడల్ అధికారి, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఓటరు చైతన్య రథం పేరుతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ కళాకారులు ప్రచారం చేశారు. ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడంతో పాటు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతిజ్ఞ చేయించారు. ఓటరు చైతన్య రథం కళాకారులు పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమం చేపట్టారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్లంతా నిబద్ధతతో ఉన్నారు..



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ కార్పొరేటర్లంతా నిజాయితీ, నిబద్ధతతో ఉన్నారని, మైండ్ గేమ్ ఆడి ఇబ్బంది పెడితే సహించేది లేదని బీఆర్ఎస్ నేత శీలంశెట్టి వీరభద్రం, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, కార్పొరేటర్లు అన్నారు. శనివారం ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ 43 మంది కార్పొరేటర్లను గెలిపించడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్పొరేటర్లంతా మంత్రి పువ్వాడ వెంట ఉంటామని అన్నారు. నిసిగ్గుగా కొంత మంది తమకు ఫోన్‌లు చేసి ప్రలోభాలకు గురి చేయాలని చూస్తే వారిని రోడ్డుపైకి గుంజి ప్రజల ముందు నిలబెడతామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి అజయ్‌కుమార్ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్లు దాదె అమృతమ్మ, గజ్జెల లక్ష్మి, రాపర్తి శరత్, మందడపు లక్ష్మి, మక్కల కమల, బుర్రి వెంకట్, దండా జ్యోతిరెడ్డి, నాయకులు తోట రామారావు, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి మద్దతు

ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్ఎస్ పార్టీకి పూర్తిగా తమ మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మారేపల్లి వెంకట్ తెలిపారు. శనివారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో కేసీఆర్ చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అభ్యర్థుల గెలుపు కోసం అన్ని వర్గాలను కలుపుకొని పోతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి సతీశ్, ఉపాధ్యక్షుడు షేక్.రెహమాన్, సభ్యులు కోటేశ్వరావు, నరేంద్రగౌడ్, గుడిపాటి రామకృష్ణ, అసిఫ్ ఉర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాల క్రికెట్ టోర్నీ



విజేతలకు కప్, మెమెంటోలు అందజేస్తున్న హనుమంతరెడ్డి

ఖమ్మం గాంధీచౌక్ / ఖమ్మం స్పోర్ట్స్: విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యాన శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖమ్మం రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యాన బ్యాంకు అధికారులు, ఉద్యోగులకు క్రికెట్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద నిర్వహించిన వాక్తాన్ కార్యక్రమానికి బ్యాంకు రీజనల్ హెడ్ హనుమంత రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ రంజిత్‌కుమార్, అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మండలాల్లో పొంగులేటి విస్తృత పర్యటన

'గడప గడపకూ కాంగ్రెస్'లో పాల్గొన్న పొంగులేటి సోదరుడు, తనయుడు



నేలకొండపల్లి: భట్టి, పొంగులేటి, తుమ్మల సమక్షంలో పార్టీలో చేరుతున్న పలువురు

తిరుమలాయపాలెం/కూసుమంచి/నేలకొండపల్లి/ఖమ్మంవన్‌టౌన్: మండలాల్లో తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామసహాయం జయసింహారెడ్డి, కూసుమంచి మండలం కోక్యాతండాకు చెందిన మాజీ సర్పంచ్ ఎర్రనాగుల పాండ్యాలతో పాటు మరికొందరు పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పైనంపల్లిలో గంద్ర గోపాలరావుకి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే జీళ్ళచెర్వు సభకు వస్తూ ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, మృతురాలు అనసూర్య కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదంలో మృతిచెందిన అనసూర్య కుటుంబానికి రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మండలంలో పొంగులేటి తనయుడు హర్షరెడ్డి, కూసుమంచి మండలంలో పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి శనివారం రాత్రి జరిగిన గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా నేలకొండపల్లి మండలంలోని బోదులబండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ అనంతు కాశయ్య, సొసైటీ డైరెక్టర్ గండారపు రామారావు, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి పొట్టపింజర సత్యం, రైతు సమన్వ సమితి కన్వీనర్ కొడాలి రాజగోపాల్‌రావు, సీనియర్ నాయకులు ఎర్రా చలపతిరావుతో పాటు మరికొందరు శనివారం రాత్రి క్యాంపు కార్యాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాయల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ చైర్మన్ సెట్రాం నాయక్, కొత్తూరు సర్పంచ్ వెంకటరమణ, దుబ్బతండా ఉప సర్పంచ్ కొడావత్ సుమన్, నాయకులు వెంకటరెడ్డి, సైదిరెడ్డి, సైదానాయక్, రామసహాయం నరేష్ రెడ్డి, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, నెల్లూరి భద్రయ్య, శివరామకృష్ణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం స్వతంత్ర అభ్యర్థిగా 'పాల్వంచ'



తీర్మాన పత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా బీసీ జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు, ఖమ్మంకు చెందిన పాల్వంచ రామారావును నిలబెట్టడానికి బీసీజేఏసీ నిర్ణయించింది. శనివారం ఈమేరకు ఆ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రామారావును స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు టికెట్ ఇవ్వని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ పేర్కొంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వివిధ పార్టీలలో ఉన్న బీసీలందరూ పార్టీలకతీతంగా పాల్వంచ రామారావు గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిట్టోజు రమేశ్, టీవీ రాజు, డాక్టర్ బీ.వీ.రాఘవులు, శ్రీనివాస్, సాయిరాం, రోశయ్య, నాగులు, జయరాజ్, సైదయ్య, అంజన్‌రాజు, గరిడేపల్లి సత్యనారాయణ, డాక్టర్ హైమావతి, రేష్మా, చందన తదితరులు పాల్గొన్నారు.

అనుచరులతో మాధవీరెడ్డి సమావేశం

కూసుమంచి: పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన పాలేరుకు చెందిన కాంగ్రెస్ నాయకురాలు రామసహాయం మాధవీరెడ్డి శనివారం పాలేరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తన అనుచరులతో సమావేశమయ్యారు. పాలేరు టికెట్ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కేటాయించటంతో భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. పాలేరులో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషిచేసిన తనలాంటి వారికి కాకుండా పార్టీలో చేరిన కొద్దిరోజులకే వేరొకరికి టికెట్ కేటాయించటం సరికాదన్నారు. అనుచరుల, అభిమానుల అభీష్టం మేరకు నడుచుకుంటానని ఆమె పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కొత్తకొత్తూరు సర్పంచ్..

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ తన అనుచరులతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా వెన్నపూసల సీతారాములు సాదరంగా ఆహ్వానించారు.నాయకులు నెల్లూరి భద్రయ్య, చెరువు స్వర్ణ, కొడాలి గోవిందరావు, కుక్కల హనుమంతరావు, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా పొంగులేటి పుట్టినరోజు వేడుకలు



ఖమ్మంరూరల్: రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న పొంగులేటి ప్రసాదరెడ్డి

ఖమ్మంరూరల్/ ఖమ్మంవన్‌టౌన్/ కామేపల్లి: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి. శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలను మండలాల్లో ఆయన అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాగా, తలసేమియా బాధితుల కోసం ఖమ్మంరూరల్ మండలంలోని రెడ్డిపల్లిలో ఆయన అభిమానులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే క్యాంపు కార్యాలయంలో తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అనే అభిమాని శ్రీనివాసరెడ్డిపై రూపొందించిన పాటల సీడీని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. కామేపల్లిలో డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదర్ వేడుకలు నిర్వహించారు.

చంద్రగ్రహణంతో ఆలయాల ద్వార బంధనం

నేడు సంప్రోక్షణం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అనుమతి



శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ద్వార బంధనం చేస్తున్న అర్చకులు, అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: చంద్రగ్రహణం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 10:30 గంటల నుంచి దేవాలయాల ద్వార బంధనం చేశారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఆశ్వయుజ శుక్ల పూర్ణిమ శనివారం అర్ధరాత్రి పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడుతుందని పండితులు చెప్పిన విషయం విదితమే.ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి 1:03 గంటలకు గ్రహణం ప్రారంభమై 2:22 గంటల వరకు ఉంటుందని పండితులు స్పష్టం చేశారు. చంద్రగ్రహణం పట్టు 9 గంటలకు ముందు సూతక కాలంగా పరిగణించి దేవాలయాలను మూసి ఉంచడం ఆనవాయితీగా వస్తోంది. గ్రహణానంతరం ఆదివారం ఉదయం సంప్రోక్షణ, తదితర పూజలు చేస్తారు. అయ్యప్ప దేవాలయాలను శనివారం రాత్రి పూజ తర్వాత 8 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు మూసి ఉంచుతున్నారు.